తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారు 1988 ఉగాదికి నిర్వహించిన కథల పోటీలో
300 రూపాయిలు బహుమతి పొందిన కథ

# అసంతృప్తి

— ఆర్. సత్యానందం



"పక్కింటి రామనాథంగారు భార్యను ఎంత ప్రేమగా చూసుకుంటారో! ఈయనా వున్నారు! 'సినిమా' అని అడిగితే చాలు, చిరుబురులాడుతారు. 'డబ్బులన్నీ ఖర్చయిపోతున్నాయి' అని అంటారు. ఓ సరదా లేదు, ఏమీ లేదు.

రోజంతా ఎంత పని యింట్లో చేసినా సానుభూతి లేదు. ఇంట్లో తిని పుట్టినే కూర్చుంటున్నానట. బాధ్యత, బరువు లేదంటారు. పిల్లలు ఒక్కరు కూడా చెప్పిన మాట వినరు. ఇప్పుడే మాట విననివాళ్ళు పెద్దవాళ్ళయితే వింటారా? దేనికయినా అదృష్టముండాలి. పెట్టిపుట్టాలి" అనుకుంది బాధగా సీతమ్మ.

... ... ...

"ఇంటి ఇల్లాలంటే ఎలా వుండాలి? పొదుపు, అదుపు అవసరం లేదా? ఎప్పుడూఅది కావాలి, ఇది కావాలి. ఈ 'కావాలి' అనే దానికి అంతం లేదు. తనేం ఉద్యోగం చేస్తోందా? ఇంట్లో వుండేదే కదా? ఇంటి పని చేసుకుంటే ఏమి? పనిమనిషిని పెట్టాలట. ఉన్న ఇబ్బందులకు తోడు అది ఒకటి. 'పనిమనిషిని భరించే స్థితిలో వున్నామా!' అని ఆలోచించదే! సిటీ బస్సు దొరకక చచ్చీ చెడి యిల్లు చేరుకుంటే 'ఇంత ఆలస్య మేమిటి? మీరు ఒక్కరేనా ఉద్యోగం చేసేది?' అని అంటోంది. అసలు ఉద్యోగం విలువ తెలిస్తే ఆ మాట అనగలదా? ఏమిటో జీవితానికి సుఖం లేదు" విసుక్కున్నాడు గోపాలరావు.

... ... ...

"అమ్మకు, నాన్నకు తమ్ముడు, చెల్లి గురించే ఎప్పుడూ. రఘుకి పాస్ మార్కులు రాలేదని తెగ బాధపడతారు. నాకు ఫస్ట్ మార్క్ వస్తే మామూలుగానే వుంటారు. చెల్లి కోసం ఎన్ని డబ్బులు దాచిపెడుతున్నారు? నా కోసం ఏం దాచిపెడుతున్నారు? గాజులు, రిబ్బన్లు, పూలు ఎప్పుడూ కొనిస్తూనే వుంటారు. అమ్మయితే మరీ. 'ఆడపిల్ల ... ఆడపిల్ల...' అంటూ ఎప్పుడూ దగ్గర కూర్చోబెట్టుకోవడం, జడ వేయడం, పూలు పెట్టడం ... తమ్ముడయితే ఎప్పుడూ అమ్మ వెనుకే! అదేమిటీ అని అంటే తను పెద్దవాడట. తమ్ముడు చిన్నవాడు కాబట్టి గారాబమట. పెద్దవాడినైతే మాత్రం తనకు అమ్మ అవసరం లేదా? నన్ను పట్టించుకునేవారే లేరు!" మధు దిగులుగా అనుకున్నాడు.

... ... ...

"ఎప్పుడు 'చదువుకో ... చదువుకో ...' అంటుంటారు అమ్మా, నాన్న. అన్నయ్యకు, చెల్లికి అంతగా చెప్పరు. నన్ను చదువుకోమని చెప్పడమే వాళ్ళ పని. అన్నయ్య ఎంత దర్జాగా వుంటాడు తనకు ఫస్ట్ మార్కులు వస్తున్నాయని? ఎందుకురావు, మరి? పెద్ద కొడుకు! ముద్దుగా చూసుకుంటారు. అడిగిన వెంటనే అన్నీ కొనిపెడతారు. నాన్న ఎక్కడికి వెళ్తున్నా పెద్దవాడని వెంట తీసుకెడతారు. వాడికి దిగులేముంది? ఫస్ట్ మార్క్ రమ్మంటే రాదూ? తనకెప్పుడూ బాధే! పెద్దవాడని అన్నయ్య మీద ప్రేమ! 'ఆడపిల్ల' అని చెల్లి అంటే మురిపెం. తనే ఎటూకాకుండా వున్నాడు. వాళ్ళలాగా తనను చూస్తే, తనకూ ఫస్ట్ మార్క్ వస్తుంది. 'అన్నయ్యకు అన్నీ కొనిపెడుతున్నారు' అని అంటే తనకు అసూయంట. తను చెడ్డవాడట. నేనేం చేసినా తప్పే! ఏది మాట్లాడినా చెడే!" వెక్కి, వెక్కి ఏడుస్తున్నాడు రఘు.

... ... ...

"అన్నయ్య లిద్దరంటే అమ్మా, నాన్నకు ప్రేమ. కొడుకులట ... కొడుకులు ... రేపు వాళ్ళని చూసేది వీళ్ళేనట. రేపు అంటే ఎప్పుడో మరి! రోజూ 'రేపు' వస్తూనే వుంది. అన్నయ్యలు వీళ్ళనేం చూడడం లేదు. అయినా, 'రేపు' వాళ్ళను చూస్తారట. అమ్మయితే మరీ! ఇల్లు ఊడవమంటుంది. కళ్ళాపి చల్లమంటుంది. అంట్లు తోమమంటుంది. అన్నయ్యలు ఈ పనులేం చేయరు. బావిలో నుంచి నీళ్ళు మాత్రం తోడుతారు. తన కెన్ని పనులు! మొన్న అన్నయ్యలిద్దరినే సినిమాలకు పంపించారు. వాళ్ళతో వెడతానంటే ... 'ఆడపిల్లవు ... ఇప్పటి నుంచే ఈ తిరుగుళ్ళేమిటి?' అని అన్నారు. వాళ్ళు వెడితే తిరుగుళ్ళు కాదు. తను వాళ్ళవెంట వస్తేనే తిరుగుళ్ళు! పెద్దన్నయ్య, చిన్నన్నయ్య ఇద్దరూ ఇద్దరే! తననసలు పట్టించుకోరు. అమ్మా, నాన్న కొడుకులని బాగా ముద్దు చేస్తారు కదా? అందుకని" అనుకుంది లక్ష్మి ఆవేదనగా.